

హైదర్‌గూడ ఎన్ఎస్ఎస్‌లో జరిగిన మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఎంఏ సిద్ధీఖ్

వక్ఫ్‌బోర్డుకు న్యాయాధికారాలు ఇవ్వండి

హిమాయత్‌నగర్, ఏప్రిల్ 4: వక్ఫ్‌బోర్డుకు న్యాయాధికారాలు ఇవ్వాలని ఉమ్మడి ఏపీ రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ ఎంఏ సిద్ధీఖ్, ఆలిండియా ముస్లిం మైనార్టీ ఆర్గనైజేషన్ చైర్మన్ సయ్యద్ ముక్తార్ హుస్సేన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం హైదర్‌గూడలోని ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ.. రాష్ట్రంలో వేలకోట్ల వక్ఫ్ భూములు, ఆస్తులు ఆక్రమణకు గురయ్యాయని చెప్పారు. వక్ఫ్ భూములను రక్షించేందుకు ప్రత్యేకంగా కమిషనరేట్‌ను ఏర్పాటు చేయాలన్నారు. ముస్లింలకు శ్మశానవాటిక స్థలం లేక తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయని వక్ఫ్ బోర్డు భూముల నుంచి 125 ఎకరాల భూమిని కేటాయించాలన్నారు. వక్ఫ్ ఆస్తులను ఆన్‌లైన్‌చేసి ప్రతి 20 ఏండ్లకు ఒకసారి సర్వే చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ప్రతినిధి నయీముల్లాషరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

చీటింగ్ కేసులో ఐదేండ్ల జైలు

హిమాయత్‌నగర్, ఏప్రిల్ 4: ప్లాట్ విక్రయం పేరుతో డబ్బులు తీసుకుని మోసానికి పాల్పడిన కేసులో నాంపల్లి 9వ ఏసీఎంఎం కోర్టు ఓ వ్యక్తికి ఐదేండ్ల జైలు శిక్ష, రూ.25వేల జరిమానా విధించింది. నారాయణగూడ ఇన్‌స్పెక్టర్ యు.చంద్రశేఖర్ వివరాల ప్రకారం.. జాలిగామ సురేశ్ 2016లో హిమాయత్‌నగర్ వీధి నం1లో ఉన్న బాలప్ప అపార్ట్‌మెంట్‌లోని ప్లాట్ విక్రయించేందుకు నల్లన శరత్‌తో అగ్రిమెంట్ చేసుకున్నాడు. ఇందుకు శరత్, సురేశ్‌కు రూ.9.25లక్షలు చెల్లించాడు. అప్పటికే అదే ప్లాట్‌ను వేరొకరికి విక్రయించాడు. విషయం తెలుసుకున్న శరత్ తన డబ్బు లు తిరిగివ్వాలని అడిగాడు. రోజులు గడిచినా ఇవ్వకపోవడంతో బాధితుడు శరత్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో నిందితుడు సురేశ్‌పై 420, 406, 506 సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. నాంపల్లి 9వ ఏసీఎంఎం కోర్టు ఐదేండ్ల జైలు శిక్ష, రూ.25వేల జరిమాన విధించిందని సీఐ యు.చంద్రశేఖర్ తెలిపారు.

ముగిసిన తొలివిడత ఎన్నికల శిక్షణ

జూబ్లీహిల్స్, ఏప్రిల్ 4: లోక్‌సభ ఎన్నికల విధులు నిర్వర్తించే అధికారులకు నాలుగు రోజులుగా నిర్వహిస్తున్న తొలి విడత శిక్షణ ముగిసింది. షేక్‌పేట్‌లోని జి.నారాయణమ్మ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ కళాశాలలో గురువారం అదర్ పోలింగ్ ఆఫీసర్ (ఓపీఓ)ల శిక్షణ నిర్వహించారు. జూబ్లీహిల్స్ అసెంబ్లీ సెగ్మెంట్ పరిధిలో 1000 మందికి పైగా అధికారులకు శిక్షణ నిర్వహించినట్టు అధికారులు తెలిపారు. కేంద్ర ఎన్నికల సంఘం నిబంధనలు అనుసరించి పోలింగ్ నిర్వహించేందుకు పోలింగ్ ఆఫీసర్స్ (పీఓ), అసిస్టెంట్ పోలింగ్ ఆఫీసర్స్ (ఏపీఓ), అదర్ పోలింగ్ ఆఫీసర్స్ (ఓపీఓ)లకు శిక్షణ పూర్తయ్యిందని జూబ్లీహిల్స్ అసెంబ్లీ సెగ్మెంట్ అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్ దశరథ్ సింగ్ రాథోడ్ తెలిపారు. లోక్‌సభ ఎన్నికలప్రక్రియ సజావుగా నిర్వహించేందుకు తొలి విడత శిక్షణ పూర్తికాగా తుది విడత శిక్షణ త్వరలో చేపట్టనున్నట్లు తెలిపారు.

ఎన్నికల శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న ఓపీఓలు

సమావేశంలో మాట్లాడుతున్న బాధితురాలు పూజిత

సహారా పేరుతో ఆర్థిక దోపిడీ చేశారు

ఖైరతాబాద్, ఏప్రిల్ 4: సహారా పేరుతో ఆర్థిక దోపిడీకి పాల్పడి తమను రోడ్డున పడేశారని బాధితురాలు పూజిత వాపోయారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో నర్సింగ్, గణేశ్‌తో కలిసి ఆమె మాట్లాడారు. సహారా ఎలాంటి డిపాజిట్లు స్వీకరించవద్దంటూ సెక్యూరిటీస్ అండ్ ఎక్స్‌ఛేంజ్ బోర్డు ఆఫ్ ఇండియా (సెబీ)తో పాటు ఆర్థిక నియంత్రణ సంస్థలు నిషేధం విధించాయని తెలిపారు. అయినా అక్రమంగా అమాయకుల వద్ద డిపాజిట్లు స్వీకరించి వారిని దోచుకుంటున్నారని ఆరోపించారు. నాలుగేండ్లుగా బాధితులమైన తాము చేస్తున్న పోరాటానికి కొంత ఫలితం దక్కిందన్నారు. బుధవారం సహారా సౌత్ జోన్ డైరెక్టర్ రామకోటేశ్వరరావును నగర సీపీ శ్రీనివాస్‌రెడ్డి చొరవతో పోలీసులు అరెస్టు చేయడం పురోగతిని కలిగించిందన్నారు. ఎందరో తల్లిదండ్రులు తమ పిల్లల చదువులు, పెండ్లిల కోసం దాచుకున్న డబ్బులను సహారా దోచుకున్నదన్నారు. ఇప్పటికే ఢిల్లీ కోర్టులో 127 మంది బాధితులు కేసులు వేశారని తెలిపారు. సహారా పేరుతో ఆర్థిక దోపిడీ చేసిన ప్రతిఒక్కరిపై నాన్‌బెయిలబుల్ కేసులు పెట్టాలని, వాటి కార్యాలయాలన్నీ సీజ్ చేయాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు.



యూసుఫ్‌గూడ సర్కిల్ సిబ్బందిని అభినందిస్తున్న జీహెచ్ఎంసీ కమిషనర్ రొనాల్డ్ రాస్

పన్ను వసూలు సిబ్బందికి ప్రశంసా పత్రాలు

జూబ్లీహిల్స్, ఏప్రిల్ 4: ఆస్తిపన్ను వసూళ్లలో అంకితభావంతో పనిచేసిన సిబ్బందిని జీహెచ్ఎంసీ కమిషనర్ రొనాల్డ్ రాస్ అభినందించారు. ఈ మేరకు యూసుఫ్‌గూడలో సర్కిల్ సిబ్బందికి జోనల్ కమిషనర్ స్నేహ శబరీశ్‌తో కలిసి ప్రశంసా పత్రాలు అందించారు. జీహెచ్ఎంసీ 19వ సర్కిల్‌లో గత ఆర్థిక సంవత్సరం (2023-24)లో ఆస్తి పన్ను వసూళ్ల లక్ష్యం 100 శాతం దాటింది. గతేడాది రూ.33.73 కోట్ల లక్ష్యానికి గానూ రూ.33.75 కోట్ల పన్ను వసూలు చేశారు. వసూళ్లలో చిత్తశుద్ధితో పనిచేసిన బిల్ కలెక్టర్లు సురేందర్, ప్రేమ్‌కుమార్, ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్లు సుమన్, హరినివాస్‌ను ప్రశంసా పత్రాలు అందించి అభినందించారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ సేవా ఇస్లావత్, ఏఎంసీలు కమల్, బాల్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతలను స్వీకరించిన బార్ అసోసియేషన్

బండ్లగూడ, ఏప్రిల్ 4: రాజేంద్రనగర్ నూతన బార్ అసోసియేషన్ సభ్యులు గురువారం బాధ్యతలను స్వీకరించారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా శీలం వెంకట్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా టీఎల్ శ్రీధర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా ఆర్.వెంటేశం, సంయుక్త కార్యదర్శిగా తులసీరాం, క్రీడా సాంస్కృతి కార్యదర్శిగా ప్రవీణ్‌కుమార్, కోశాధికారిగా రాజశేఖర్, గ్రంథాలయం కార్యదర్శిగా కృష్ణ, కార్యనిర్వాహక సభ్యులుగా మీత్‌సింగ్, ప్రతాప్‌గౌడ్, శశికాంత్‌రెడ్డి, జయకృష్ణ, మహిళా రిప్రజెంటేటివ్‌గా భానుప్రియను ఎన్నుకున్నారు.

బాధ్యతలను స్వీకరించిన నూతన బార్ అసోసియేషన్ సభ్యులు

పక్షవాతానికి చికిత్స పేరిట మోసం.. కేసు నమోదు

వెంగళరావునగర్, ఏప్రిల్ 4: పక్షవాతానికి ఉచిత చికిత్స చేస్తామని, మందులకే డబ్బులివ్వాలని నమ్మించి మోసగించారు. మధురానగర్ పోలీసుల కథనం ప్రకారం.. మధురానగర్‌లో ఉండే మహ్మద్ మెహబూబ్‌అలీ టీ దుకాణాన్ని నిర్వహిస్తున్నాడు. గతేడాది మార్చి 16న జావీద్, శ్రీనాథ్ అనే ఇద్దరు వ్యక్తులు టీ షాప్ వద్దకు వచ్చారు. పక్షవాతం చికిత్సకు పైసా కూడా తీసుకోకుండా ఉచితంగా వైద్యం అందిస్తామంటూ వారిద్దరు నమ్మించారు. తన తల్లికి పక్షవాతం ఉన్నదని, ట్రీట్‌మెంట్ చేయాలని మెహబూబ్ అలీ కోరాడు. రెండు నెలల్లో నయం చేస్తామని మోసగాళ్లు చెప్పి.. మందుల కోసమంటూ రూ.22 వేలు తీసుకున్నారు. చింతల్‌లోని శ్రీనాథ్ ఆయుర్వేదిక్ భండార్‌కు వెళ్లి మందులు తీసుకోవాలని సూచించారు. అదేరోజు అక్కడికి చేరుకున్న అలీ.. శ్రీనాథ్ ఆయుర్వేదిక్ దుకాణంలో రాజు శివరామ్ గోసావిని కలిసి, అక్కడ మందులు తీసుకుని వారు చెప్పిన విధంగా మందులను వాడారు. అయితే, నెలలు గడుస్తున్నా ఫలితం లేకపోడంతో జావీద్‌కు ఫోన్ చేశాడు. దీంతో మరోసారి మందులు కొనుక్కోవాలని చెప్పాడు. అయితే తాను మోసపోయానని గ్రహించిన మెహబూబ్ అలీ.. పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు మధురానగర్ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

పాత మెడికల్ రికార్డ్స్‌ను తొలగిస్తాం

ఖైరతాబాద్, ఏప్రిల్ 4: నిమ్స్ దవాఖానలో ఉన్న పాత మెడికల్ రికార్డులను తొలగిస్తున్నట్లు మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ నిమ్మ సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. నిమ్స్‌కు వచ్చే రోగుల మెడికల్ రికార్డ్స్‌ను ఎప్పటికప్పుడూ భద్రపరుస్తామని, అయితే కొన్నేళ్లుగా వేలాది రికార్డులు పేరుకు పోయాయని తెలిపారు. మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా నిబంధనల ప్రకారం ప్రతి పదేండ్లకోసారి పాత రికార్డులను నిర్వీర్యం చేస్తారన్నారు. అదే నేపథ్యంలో 2011 జనవరి 1వరకు ఉన్న రికార్డులను పూర్తిగా తొలగించేందుకు వైద్యుల కమిటీ నిర్ణయం తీసుకుందని వెల్లడించారు. ఈ కాల వ్యవధిలో ఎవరైనా రోగులు ఆస్పత్రిలో చికిత్స పొందిన రోగుల ఎంఎల్‌సీ రికార్డులు, ఇతర కేస్‌షీట్లు కావాలనుకుంటే మెడికల్ సూపరింటెండెంట్ లేదా ఎంఆర్‌డీ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ట్రాఫిక్‌కు అడ్డంకులు.. వ్యాపారులపై కేసులు

బంజారాహిల్స్, ఏప్రిల్ 4: రోడ్డుపై వాహనాల రాకపోకలకు అడ్డంకులు కల్పిస్తూ వ్యాపారాలు ఏర్పాటు చేసిన ఇద్దరు వ్యక్తులపై ఫిలింనగర్ పోలీసులు కేసులు నమోదు చేశారు. షేక్‌పేట ప్రధాన రహదారిలోని డీమార్ట్ సమీపంలో రంజాన్ సందర్భంగా సయ్యద్ అదిల్ అనే వ్యక్తి 'నూర్ ఏ రంజాన్ ఎక్స్‌పో' పేరుతో షాపు ఏర్పాటు చేశాడు. పార్కింగ్ సౌకర్యం లేక వాహనదారులు తమ వాహనాలను ఫుట్‌పాత్‌తో పాటు వాక్ వే మీద పార్క్ చేస్తున్నారు. రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడుతుందని టోలీచౌకి ట్రాఫిక్ ఎస్సై ఫిలింనగర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా ఐపీసీ 283, 341, 336 సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మరో ఘటనలో టోలీచౌకిలోని ఎంఎఫ్ గార్డెన్ ఫంక్షన్‌హాల్‌లో ముర్తుజా 'రౌనక్-ఏ-రంజాన్' పేరుతో షాపింగ్ ఎక్స్‌పో ఏర్పాటు చేశారు. పార్కింగ్ సౌకర్యం సరిపోయినంత లేకపోవడంతో కట్టమర్లు రోడ్లపై, ఫుట్‌పాత్‌లపై పార్కింగ్ చేస్తున్నారు. ట్రాఫిక్ ఎస్సై ప్రేమ్‌రాజ్ ఇచ్చిన ఫిర్యాదుతో నిర్వాహకుడు ముర్తుజా మీద ఐపీసీ 283, 341, 336 సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఇఫ్తార్ ఐక్యతకు దోహదం

వెంగళరావునగర్: ఇఫ్తార్ విందు ఐక్యతకు దోహదమని మాజీ ఎంపీ, టీం ఇండియా క్రికెట్ మాజీ సారథి మహ్మద్ అజహరుద్దీన్ అన్నారు. గురువారం శ్రీరామ్‌నగర్‌లో ఏంజిల్ ఉడ్ డిగ్రీ స్కూల్ డైరెక్టర్ ఇలియాస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్‌కు విచ్చేశారు. ఈ కార్యక్రమంలో రహ్మత్‌నగర్ కార్పొరేటర్ సీఎన్ రెడ్డి, జూబ్లీహిల్స్ కాంగ్రెస్ నాయకుడు నవీన్‌యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

చౌదర్‌గూడ గ్రామంలో ధ్వంసమైన ఫిరంగినాలాను పరిశీలిస్తున్న తహసీల్దార్ నాగమణి, ఇరిగేషన్ ఏఈ మౌనిక

ఫిరంగినాలాను పరిశీలించిన తహసీల్దార్

శంషాబాద్ రూరల్, ఏప్రిల్ 4: ఫిరంగినాలాను ధ్వంసం చేశారని స్థానికుల ఫిర్యాదుతో స్పందించిన శంషాబాద్ తహసీల్దార్ నాగమణి, ఇరిగేషన్ ఏఈ మౌనిక, ఆర్ఐ సారిక మండలంలోని చౌదర్‌గూడలో ధ్వంసం చేసిన నాలాను గురువారం పరిశీలించారు. వారు మాట్లాడుతూ.. ఏండ్ల నాటి నుంచి ఉన్న ఫిరంగినాలాను మండలంలోని చౌదర్‌గూడ గ్రామ పరిధిలో కొందరు రియల్‌ఎస్టేట్ వ్యాపారులు ధ్వంసం చేయడంతో సమస్య తలెత్తింది. ఇక్కడి పరిస్థితిని ఉన్నతాధికారులకు నివేదికలో పంపిస్తామని తెలిపారు. ఉన్నతాధికారులు ఆదేశాల మేరకు అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం

రక్తదాన శిబిరంలో పాల్గొన్న ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రమోహన్‌రెడ్డి తదితరులు

మణికొండ, ఏప్రిల్ 4: రక్తదానం ప్రాణదానంతో సమానం అని మహాత్మ గాంధీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో రక్తదానం చేశారు. ప్రిన్సిపాల్ హాజరై మాట్లాడుతూ.. యువత సమాజ హితం కోరే పనుల్లో చిత్తశుద్ధితో పని చేయాలన్నారు. ఆపదలో ఉన్న వారిని కాపాడేందుకు ప్రతి ఒక్కరు ముందుకు వచ్చి రక్తదానం చేయాలన్నారు. యువత ప్రతి 3-4 నెలలకు ఒకసారి రక్తదానం చేయొచ్చని చెప్పారు. కార్యక్రమంలో 55 యూనిట్ల రక్తాన్ని సేకరించామని ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ జి.బాల్‌రెడ్డి పేర్కొన్నారు. రు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సుధాకర్‌రెడ్డి, హెచ్ఆర్ బి.అమర్‌నాథ్, ప్రతిమ సాయి బ్లడ్ బ్యాంక్ సభ్యులు పాల్గొన్నారు.

'రాజకీయాన్ని వ్యాపారంగా మార్చారు'

నూతన అధ్యక్షుడు డేవిడ్‌పాల్‌కు నియామకపత్రాన్ని అందజేస్తున్న జాతీయ అధ్యక్షుడు యోగేశ్

ఖైరతాబాద్, ఏప్రిల్ 4: దేశంలో విద్య, వైద్యంతో పాటు రాజకీయాన్ని సైతం వ్యాపారంగా మార్చారని రాష్ట్రీయ మానవ్ పార్టీ జాతీయ అధ్యక్షుడు ఎం. యోగేశ్‌శెట్టి అన్నారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 140 కోట్లకు పైగా ఉన్న జనాభా కలిగి దేశంలో వేళ్లపై లెక్కపెట్టే పార్టీలు మాత్రమే అధికారాన్ని చేజిక్కించుకుంటున్నాయని అన్నారు. ప్రాంతాలు, మతాల మధ్య చిచ్చుపెడుతూ తమ రాజకీయ పబ్బాన్ని గడుపుతున్నాయని విమర్శించారు. నిస్వార్థంగా, అవినీతి రహితంగా ప్రజలకు సేవలందించేందుకు రాష్ట్రీయ మానవ్ పార్టీని స్థాపించానన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో 130 స్థానాల్లో పోటీ చేస్తున్నామని, ప్రజలకు ప్రస్తుత రాజకీయ పరిస్థితులను వివరిస్తూ ఓట్లు అడుగుతామన్నారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికైన సత్యానంద డేవిడ్‌పాల్‌కు నియామకపత్రాన్ని అందజేశారు. పార్టీ ఉపాధ్యక్షురాలు గీతాకుమారి, ప్రధాన కార్యదర్శి బెజవాడ రవికుమార్, కనకం రమేశ్, అనురాధ పాల్గొన్నారు.

సదరం క్యాంపు దరఖాస్తుల ఆహ్వానం

శంషాబాద్ రూరల్, ఏప్రిల్ 4: సదరం క్యాంపు కోసం దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో మున్ని గురువారం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రంగారెడ్డి జిల్లాలోని దివ్యంగులు సదరం క్యాంపు కోసం దరఖాస్తులు చేసుకోవడానికి ఈనెల 8న ఉదయం 11 గంటలకు ఆన్‌లైన్ ద్వారా స్లాట్ బుక్ చేసుకోవాలని పేర్కొన్నారు. మీ సేవ ద్వారా దరఖాస్తు చేసుకున్న వారు సూచించిన దవాఖానకు వెళ్లి ఇక్కడి నుంచి డాక్టర్ సర్టిఫికెట్ తీసుకోవాలన్నారు. జిల్లాలోని దివ్యంగులు కొండాపూర్, వనస్థలిపురంలోని దవాఖానల్లో క్యాంపు ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. ఆధార్, రేషన్ కార్డులను తప్పనిసరిగా తీసుకురావాలన్నారు.

ఐపీఎల్ మ్యాచ్‌పై బెట్టింగ్.. కేసు నమోదు

బంజారాహిల్స్, ఏప్రిల్ 4: ఐపీఎల్ మ్యాచ్‌లపై ఆన్‌లైన్ బెట్టింగ్‌లు స్వీకరిస్తున్న వ్యక్తులపై ఫిలింనగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. షేక్‌పేటలోని వినాయక్‌నగర్‌లో ఆర్.జగదీశ్ క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్నాడనే సమాచారం అందుకున్న పోలీసులు బుధవారం రాత్రి దాడులు నిర్వహించారు. వైజాగ్‌లో జరుగుతున్న ఢిల్లీ క్యాపిటల్, కోల్‌కతా నైట్‌రైడర్స్ మ్యాచ్‌పై 'క్రికెట్ లైన్ గురూ' ద్వారా బెట్టింగ్‌లు స్వీకరిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. కార్వాన్‌లోని వినయ్‌సింగ్ అనే బుకీ ద్వారా జగదీశ్ బెట్టింగ్‌లను పాల్పడుతున్నాడని తేలింది. నిందితుడిని అరెస్ట్ చేసిన పోలీసులు అతడి నుంచి రెండు సెల్‌ఫోన్లు, రూ.25వేల నగదు స్వాధీనం చేసుకున్నారు. బుకీ వినయ్‌సింగ్ కోసం గాలింపు చేపట్టారు.

నార్సింగిలో ట్రాఫిక్ పోలీసుల జులుం

మణికొండ, ఏప్రిల్ 4: నార్సింగిలో ట్రాఫిక్ పోలీసులు అడ్డగోలు వసూళ్లు రోజురోజుకు మితిమీరిపోతున్నాయి. గత కొన్నాళ్లుగా ట్రాఫిక్ రద్దీపై పట్టింపులేకుండా రోడ్ల ప్రధాన చౌరస్తా వద్ద ఆటోలు తిష్టవేసి ప్రయాణికులకు ఇబ్బందులు కలుగుతుందంటూ అధికారులకు విన్నవించినా పట్టించుకోకుండా 'మాములు'గా తీసుకుంటున్నారు. దీంతో నార్సింగి-మంచిరేవుల చౌరస్తాలో నిత్యం ట్రాఫిక్ రద్దీ పెరిగిపోతుంది. ఇదిలా ఉంటే.. గురువారం నార్సింగి-మంచిరేవుల చౌరస్తా సమీపంలోని ఓ కన్వెన్షన్ సెంటర్‌లో జరిగిన కార్యక్రమానికి సీఎం రేవంత్ హాజరయ్యారు. మధ్యాహ్నం 3గంటలకు హాజరయ్యే కార్యక్రమానికి ఉదయం 10 గంటల నుంచే ట్రాఫిక్ పోలీసులు ప్రధాన రహదారి ఇరువైపుల ఉన్న వ్యాపార కేంద్రాలన్నీ మూసివేశారు. ఫుట్‌పాత్ పక్కన నిలిపిన వాహనాలను సైతం తీసివేయాలని లేకపోతే చలాన్లు వేస్తామంటూ ఓ హోంగార్డు ఫోటోలు తీస్తూ స్థానికులను బెదిరింపులకు గురిచేశారు. డబ్బులివ్వాలని అక్రమ వసూళ్లు చేశారని స్థానికులు మండిపడుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి బెదిరింపులకు పాల్పడుతున్న క్షేత్రస్థాయి సిబ్బందిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

భారతీయ జీవనవిధానమే విశ్వగురువు

బంజారాహిల్స్, ఏప్రిల్ 4: భారతీయ సంస్కృతికి, జీవన విధానాన్ని, తాత్విక చింతనను ప్రపంచం మొత్తం ప్రత్యేకంగా గుర్తిస్తుంటే మనం మాత్రం పాశ్చాత్య ప్రభావానికి లోను కావడం ఆవేదన కలిగిస్తుందని భారత మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు అన్నారు. బంజారాహిల్స్ రోడ్ నం.4లోని కళాకృతి ఆర్ట్ గ్యాలరీలో ప్రముఖ కళాకారుడు ఆర్.గిరిధర్‌గౌడ్ వేసిన మినియేచర్ పెయింటింగ్స్‌తో ఏర్పాటు చేసిన శివ అండ్ శక్తి ఆర్ట్ ఎగ్జిబిషన్‌ను గురువారం వెంకయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సంగీతం, సాహిత్యం, చిత్రలేఖనం, నాట్యకళలు భారతీయ సంస్కృతిలో భాగమని అన్నారు. ఒకప్పుడు భారతదేశం ప్రపంచానికే విశ్వగురువుగా ఉండేదన్నారు. అయితే పాశ్చాత్య పోకడలు పెరిగిపోవడంతో భాషతో పాటు వేషధారణలో మార్పులు వచ్చాయన్నారు. ప్రపంచంలో ఎక్కడ మంచి ఉన్నా స్వీకరించడం తప్పులేదని, అదే క్రమంలో మన మాతృభాషను మర్చిపోవద్దన్నారు. ఈ కార్యక్రమంలో సినీరచయిత తనికెళ్ల భరిణి, అంతర్జాతీయ క్రికెట్ అంపైర్ అనిల్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.



శ్మశానవాటికలో అక్రమంగా వెలసిన నిర్మాణాలను కూల్చివేసిన రెవెన్యూ అధికారులు

శ్మశానవాటికలో అక్రమ నిర్మాణాల తొలగింపు

మణికొండ, ఏప్రిల్ 4: మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని శ్మశానవాటికలో అక్రమంగా వెలసిన నిర్మాణాలను గురువారం గండిపేట రెవెన్యూ అధికారులు కూల్చివేశారు. విలువైన భూమిని ఆక్రమించేందుకు కొంతమంది యత్నిస్తున్న క్రమంలో స్థానికులు స్పందించి జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో కలెక్టర్ ఆదేశాల మేరకు ఎట్టకేలకు అక్రమ నిర్మాణాల కూల్చివేతలను అధికారులు చేపట్టారు.

ఓటు హక్కు ప్రాముఖ్యంపై అవగాహన ర్యాలీ

నార్సింగిలో ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, సిబ్బంది

మణికొండ, ఏప్రిల్ 4: ఓటు హక్కు ప్రాముఖ్యాన్ని ప్రతిఒక్కరూ తెలుసుకోవడంతో పాటు ఓటును వినియోగించుకోవాలని స్వీప్ నోడల్ ఆఫీసర్, బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ బి.శరత్‌చంద్ర తెలిపారు. లోక్‌సభ ఎలక్షన్-2024 స్వీప్ కార్యక్రమంలో భాగంగా 'ఐ ఓట్ ఫర్ స్యూర్' థీమ్‌తో గురువారం నార్సింగి మున్సిపల్ పరిధిలో అవగాహన ర్యాలీ చేపట్టారు. మున్సిపల్ ఆఫీస్ నుంచి రిజిస్ట్రార్ ఆఫీసర్ రోడ్, ఓల్డ్ పీఎస్ రోడ్, ప్రభుత్వ వైద్యశాల రోడ్డులో మున్సిపల్ కార్యాలయం వరకు శానిటేషన్ సిబ్బందితో ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. రానున్న లోక్‌సభ ఎన్నికల్లో ప్రజలకు ఓటు హక్కు ప్రాముఖ్యతను వివరించేందుకు అవగాహన చేపడుతున్నామన్నారు. అనంతరం మున్సిపల్ కార్యాలయం వద్ద ఓటర్ల ప్రతిజ్ఞ చేయించారు. నార్సింగి మున్సిపల్ కమిషనర్ టి.ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, డీఈఈ నర్సింహరాజు, మేనేజర్ యోగేశ్‌నాయక్, మెప్మా ఆర్‌పీలు, శానిటరీ జవాన్లు, స్వీపర్లు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంలో గుర్తుతెలియని వ్యక్తి మృతి

వెంగళరావునగర్, ఏప్రిల్ 4: విద్యుదాఘాతంతో గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన ఎస్ఆర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై శ్రవణ్‌కుమార్ వివరాల ప్రకారం.. బల్కంపేటలోని ఎస్‌బీఐ బ్యాంకు ముందున్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ తగిలి బుధవారం రాత్రి ఓ వ్యక్తి ఉన్నట్లు స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు అపస్మారకస్థితిలో ఉన్న బాధితుడిని 108 ద్వారా గాంధీ దవాఖానకు తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే వ్యక్తి మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతి చెందిన వ్యక్తి వయసు సుమారు 25 నుంచి 30 సంవత్సరాలు ఉంటుందని, ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అగ్గిపెట్టె ఉందా అంటూ.. సెల్‌ఫోన్ చోరీ

ఖైరతాబాద్, ఏప్రిల్ 4: అగ్గిపెట్టె ఉందా అంటూ ఓ వ్యక్తి సెల్‌ఫోన్‌ను గుర్తుతెలియని దుండగుడు లాక్కెళ్లాడు. ఈ ఘటన పంజాగుట్ట పోలీసు స్టేషన్ పరిధిలోని అమీర్‌పేట కేఎల్ఎం షాపింగ్ మాల్ వద్ద జరిగింది. నగరంలోని నాచారం పరిధి గోకుల్‌నగర్‌కు చెందిన సుడిగాల సాయికుమార్ క్యాబ్ డ్రైవర్. గురువారం షాపు వద్ద ఉండగా, గుర్తుతెలియని వ్యక్తి వచ్చి అగ్గిపెట్టె అడిగాడు. లేదని చెబుతుండగానే చేతిలో ఉన్న సెల్‌ఫోన్‌ను లాక్కొని పరుగులు పెట్టాడు. షాపు ఎదురుగా ఉన్న ఆటో ఎక్కిపారిపోయాడు. వెంటనే కారులో ఆటోను వెంబడించగా అప్పటికే జారు